క్లుప్తంగా

రావిఆకుపై దుర్గాదేవి చిత్రం



పొదలకూరు: దసరా పండగ సందర్భంగా మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన పచ్చా పెంచలయ్య రావిఆకుపై దుర్గాదేవి బొమ్మను చిత్రీకరించారు.

పోర్టులో పూజలు



వాహనాలకు పూజ చేస్తున్న దృశ్యం

ముత్తుకూరు: దసరా సందర్భంగా అదానీ కృష్ణపట్నం పోర్టులో శుక్రవారం ఆయుధ పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు వాహనాలకు పూజా కార్యక్రమాలు చేశారు. అలాగే ఆయా విభాగాల అధికారులు యంత్రాలకు, పరికరాలకు శాస్త్రోక్తంగా పూజలు చేయించారు. సిబ్బందికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వాహనాల ఇన్‌చార్జి గోపీకృష్ణ, పుచ్చలపల్లి శ్రీనివాసులు, రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా ఆరాధనోత్సవాలు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో సాయిబాబా ఆరాధనోత్సవాలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం ప్రారంభించారు. తొలి రోజు భిక్షాటన కార్యక్రమాన్ని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయినాథుడి వేషధారణలో భక్తులు నగరంలోని పద్మావతినగర్, బాలాజీనగర్, ఏసీనగర్, సరస్వతీనగర్ తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేశారు. సాయినాథుడికి అభిషేకాలు, పూజలను నిర్వహించారు. అనంతరం 36 మంది భక్తులను సాయినాథుడి ప్రతి రూపాలుగా భావించి పాదపూజను జరిపారు. ఉభయకర్తలుగా గునుపూడి వేణుగోపాల్, రాజ్యలక్ష్మి, కోటంరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీలత దంపతులు వ్యవహరించారు. సాయిదర్బార్ గౌరవ సలహాదారుడు పాబోలు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



నెల్లూరు సిటీ: పెద్దాస్పత్రిలో గర్భిణికి రక్తం అవసరం కావడంతో పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు సలీమ్ వెంటనే స్పందించారు. అవసరమైన రక్తాన్ని దానం చేశారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.

పురసేవల పరిశీలనలో కమిషనర్

నెల్లూరు(బారకాసు): పురసేవలపై అధ్యయనంలో భాగంగా కేరళ రాజధాని తిరువనంతపురంలో మురుగు శుద్ధి కేంద్రాన్ని స్థానిక అధికారులతో కలిసి కమిషనర్ సూర్యతేజ శుక్రవారం పరిశీలించారు. అక్కడ అమలవుతున్న తాగునీటి సరఫరా, మంచినీటి యాజమాన్య విధానాలపై కేరళ వాటర్ అథారిటీ అధికారి జీవన్‌బాబుతో సమావేశంలో పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

నెల్లూరు(అర్బన్): సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం బాలికల హక్కులకు సంబంధించిన పోస్టర్లు, బేటీ పడావో.. బేటీ బచావో పోస్టర్లను ఆవిష్కరించారు. బాలికల సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి, సీఐ కృష్ణారెడ్డి, ఏఎస్సై శ్రీహరి, ఐటీడీఏ ఏఎల్‌ఓ శాంతి, గర్ల్ చైల్డ్ ఆఫీసర్ మమత తదితరులు పాల్గొన్నారు.

విద్యను కార్పొరేట్‌కు తాకట్టు పెట్టడం తగదు

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ విద్యను కార్పొరేట్లకు తాకట్టు పెట్టడం సరికాదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శ్రీహర్ష పేర్కొన్నారు. నగరంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు నీట్, ఐఐటీ శిక్షణను నారాయణ విద్యాసంస్థల ద్వారా అందజేయనున్నామని ఇంటర్ బోర్డు ప్రకటించిందని, దీన్ని ఎస్‌ఎఫ్‌ఐ వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్, నేతలు మధు, సురేంద్ర పాల్గొన్నారు.

జాడలేని చినుకు



దుక్కి పనులు చేపట్టి వదలేసిన పొలం



గతేడాది సాగు చేసిన మినుము పంట (ఫైల్)

మండలంలో చినుకుజాడ కనిపించడం లేదు. ఖరీఫ్‌లో పప్పు ధాన్యాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. అక్టోబర్ నెలలోనూ ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- పక్క మండలాల్లో తేలికపాటి వర్షాలు
- గణనీయంగా తగ్గిన మెట్ట పంటల సాగు
- అక్టోబర్‌లోనూ అధిక ఉష్ణోగ్రతలు

పొదలకూరు: సాధారణంగా ఈరోజుల్లో మెట్టరైతులు మినుము, పెసర, కంది, పచ్చిశనగ, పొద్దుతిరుగుడు పంటల సాగులో బిజీగా ఉంటారు. అయితే స్వల్పంగా దుక్కి పనులు పూర్తి చేసిన రైతులు ధైర్యం చేసి విత్తనాలను చల్లకుండానే వదిలేస్తున్నారు. చిత్తకార్తె వచ్చినా వర్షాలు కురవడం లేదు. సాధారణంగా ఈ సమయంలో నేల చిత్తడి చిత్తడిగా ఉంటుందనే నానుడి ఉంది. ఒకప్పుడు ఈ కార్తెలో కూడా చెరువులు నిండిన సందర్భాలున్నాయి. నేడు పక్క మండలాల్లో తరచూ వర్షపాతం నమోదు అవుతున్నా పంటల సాగుకు పనికిరావడం లేదు. తోటల్లోని బోర్లలో భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో ఉన్నా వర్షాలు కురవకుంటే పరిస్థితి తారుమారు అవుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

స్వల్పంగానే..

సుమారు 10 వేల ఎకరాలకు పైబడి ప్రతి సంవత్సరం ఖరీఫ్‌లో రైతులు మెట్టపంటల సాగు చేపట్టేవారు. అయితే అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల కారణంగా పప్పు ధాన్యాల సాగును గణనీయంగా తగ్గిపోయింది. ఒకానొక సమయంలో వెయ్యి ఎకరాలోపే మినుము, పెసర పంటలను సాగు చేయడం జరిగింది. ఇప్పుడు అది కూడా లేకుండా పోయింది. లీజుకు పొలాలు తీసుకుని సాగు చేయకుండా సొంత పొలాల్లోనే మినుము, పెసర పంటల సాగు చేస్తున్నారు.

తగిన వర్షపాతం

ఈ ఏడాది ఆగస్టులో సాధారణ వర్షపాతం 86.0 మి.మీ, సెప్టెంబర్‌లో 110.2 మి.మీ, అక్టోబర్‌లో 233.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే ఈ నెలల్లో ఆశించిన స్థాయిలో వాన పడలేదు. అక్టోబర్ నెలపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే చినుకుజాడ లేదు. అధిక ఉష్ణోగ్రతలతో జనం అల్లాడిపోతున్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



నెల్లూరు(వీఆర్సీసెంటర్): భగత్‌సింగ్ కాలనీలోని సచివాలయ పరిధిలో మహిళా పారిశుధ్య కార్మికులు, సెక్రటరీలు, మేస్త్రీలపై వేధింపులను ఆపాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాను శుక్రవారం చేపట్టారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, నేతలు భాగ్యమ్మ, యేసు, దేవదాసు, జరీనా, సుజాత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

నెల్లూరు రూరల్: నగరంలోని గోమతినగర్, సర్వేపల్లి కట్టలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, ఘంటా విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేర్ టేకర్‌కు లెఫ్టినెంట్ హోదా



విడవలూరు: స్థానిక పీఆర్ఆర్ – వీఎస్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ కేర్ టేకర్‌గా పనిచేస్తున్న న్యామతుల్లా లెఫ్టినెంట్ హోదాను పొందడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ సుజాత పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో గల ఎన్‌సీసీ ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీలో 75 రోజుల పాటు శిక్షణ పొంది, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారని శుక్రవారం వివరించారు. ఈ క్రమంలో అకాడమీ కమాండ్ మేజర్ జనరల్ కపిల్‌జిత్ రాథోడ్ సమక్షంలో హోదాను పొందారని వివరించారు.

మెరుగైన పోస్టల్ సేవలు



తపాలా శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

ఇందుకూరుపేట: ప్రజలకు చేరువలో మెరుగైన పోస్టల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని నెల్లూరు ఈస్ట్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. 'జనంలోకి మనం' కార్యక్రమాన్ని మండలంలోని ఇందుకూరుపేటలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్, పోస్టల్ లైఫ్ ఇన్సురెన్స్, ఐపీపీబీ బ్యాంకింగ్ సేవలు, స్టాంప్స్ కలెక్షన్ తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సబ్ డివిజన్ ప్రగతి పథంలో పయనించేలా చూడాలని కోరారు. అనంతరం ర్యాలీని నిర్వహించారు. ఇందుకూరుపేట సబ్ పోస్ట్‌మాస్టర్ సాయికుమార్, వెంకయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొలనకుదురులో గ్రామసభ

మనుబోలు: సామాజిక తనిఖీల్లో భాగంగా మండలంలోని కొలనకుదురు గ్రామంలో 2023 – 24 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై సర్పంచ్ వెంకటరమణయ్య అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు సునీల్‌కుమార్‌రెడ్డి పలు ఆరోపణలు చేశారు. అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఉపాధి పథకం టీఏ గుర్రప్ప, ఎఫ్ఏ యస్దాని తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు భారీగా దరఖాస్తులు

ఇందుకూరుపేట: ఇందుకూరుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని ఇందుకూరుపేట, టీపీగూడూరు, ముత్తుకూరు మండలాల్లో గల 18 మద్యం దుకాణాలకు 370 దరఖాస్తులు అందాయని సీఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందుకూరుపేట మండలంలో ఐదు షాపులకు 98 దరఖాస్తులొచ్చాయని వివరించారు. లాటరీ పద్ధతి ద్వారా దుకాణాలను కేటాయించనున్నామని తెలిపారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ పరిధిలోని సంగం, దగదర్తి, బుచ్చిరెడ్డిపాళెం మండలాలకు సంబంధించిన 14 మద్యం షాపులకు గానూ 258 దరఖాస్తులొచ్చాయని ఆ శాఖ సీఐ కిశోర్ తెలిపారు. సంగం మండలంలోని మూడు షాపులకు 75, దగదర్తిలోని రెండు షాపులకు 52, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని తొమ్మిది షాపులకు 131 దరఖాస్తులు అందాయని చెప్పారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణకు వినతి

నెల్లూరు(టౌన్): కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని జేఏసీ రాష్ట్ర చైర్మన్ సురేష్, కో చైర్మన్ కల్లూరి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు అమరావతిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. నేతలు వీరయ్య, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న తులసీరామ్ తదితరులు

మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు గ్రామంలో మినీ వాటర్ స్కీంకు సంబంధించిన మూడు మోటార్లు గురువారం ఒకేసారి కాలిపోయాయి. కొండూరుసత్రం, అరుంధతీయవాడల్లో తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో స్పందించిన సర్పంచ్ కట్టుమూరి నాగమ్మ, ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్ శుక్రవారం యుద్ధ ప్రాతిపదికన బోరుకు మరమ్మత్తులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టుమూరి శ్రీనివాసులు, బద్దెపూడి సురేష్, చెముడుగుంట రాజగోపాల్, పంతగిరి వెంకయ్య, ఆవుల మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు అటకెక్కినట్టేనా..?



టపాతోపులో పింఛన్ల పంపిణీ (ఫైల్)

- అక్టోబర్ నుంచి ఇస్తామని ప్రభుత్వ హామీ
- నేటికీ తెరుచుకోని వెబ్‌సైట్
- కార్యాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు

కొడవలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా కొత్త పింఛన్ల పంపిణీపై నేటికీ ఎలాంటి కార్యాచరణను రూపొందించలేదు. కొత్త సామాజిక పింఛన్లను అక్టోబర్ నుంచి మంజూరు చేస్తామని ప్రభుత్వ పెద్దలు మొదట్లో ప్రకటించారు. వీరి మాటలను నమ్మిన ఎంతో మంది లబ్ధిదారులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

నిరాశతో వెనుదిరుగుతూ..

అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు కొత్త పింఛన్ల కోసం నిరీక్షిస్తున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మండలంలో పాటు నెల్లూరు కలెక్టరేట్లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వెళ్తున్నారు. అయితే దీనికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి వెబ్‌సైట్‌ను తెరవలేదనే సమాధానం చెప్పుండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. స్థానికంగా ఉన్న సచివాలయాలకు వెళ్లినా ఇదే సమాధానం వస్తోంది.

ఎప్పుడిస్తారో..?

గత ప్రభుత్వం చివరి దశలో దరఖాస్తు చేసుకున్న వారు సైతం పింఛన్లను ఎప్పుడు మంజూరు చేస్తారానని ఎదురుచూస్తున్నారు. కొత్తగా ఒక్కరికీ పింఛన్‌ను మంజూరు చేయకుండానే 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసుకోవడం పలువుర్ని విస్మయానికి గురిచేస్తోంది.

గతంలో ఎంతో సజావుగా..

గత ప్రభుత్వ హయాంలో రాజకీయాలు, పార్టీలకతీతంగా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు సులువుగా మంజూరయ్యేవి. ఆ సమయంలో ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛన్లు, రేషన్ కార్డుల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపేశారు. దీంతో కొత్తగా పింఛన్, రేషన్ కార్డు పొందాలనుకునే వారి అగచాట్లు వర్ణనాతీతమవుతున్నాయి.

ఆర్భాటంగా పాత పింఛన్ల పంపిణీ

కొత్తగా ఒక్క పింఛన్‌నూ మంజూరు చేయకపోయినా, గతంలో మంజూరైన వాటినే ప్రజాప్రతినిధులు, నేతలతో పంపిణీ చేయిస్తూ ఆర్భాటం చేస్తున్నారు. గతంలో ఇచ్చిన పింఛన్ రూ.మూడు వేలకు వెయ్యిని పెంచిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇదే తరహాలో వారు ఆర్భాటం చేస్తున్నారు. పెంచిన పింఛన్ కొంతైతే, ప్రచారం మాత్రం బోలెడంత చేసుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

'కిమ్స్'లో కిడ్నీ మార్పిడి విజయవంతం

నెల్లూరు(అర్బన్): డయాలసిస్ చేయించుకుంటూ హెపటైటిస్ – సీతో బాధపడుతున్న ఓ రోగికి కిడ్నీని విజయవంతంగా మార్చామని కిమ్స్ సూపర్ స్పెషాల్టీ నెఫ్రాలజిస్ట్ సన్నీష్‌రెడ్డి పేర్కొన్నారు. దర్గామిట్టలోని ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వివరాలను ఆయన తెలియజేశారు. సైదాపురం మండలం చాగణానికి చెందిన 32 ఏళ్ల సురేష్ డయాలసిస్‌ను నాలుగేళ్లుగా చేయించుకుంటున్నారని చెప్పారు. హెపటైటిస్ – సీ పాజిటివ్ ఉండటంతో కిడ్నీ మార్పిడి చేసేందుకు డాక్టర్లు ముందుకురాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో తమ ఆస్పత్రికి సురేష్ రాగా, తాము కేసును సవాల్‌గా తీసుకున్నామని వివరించారు. కిడ్నీని తండ్రి ప్రభాకర్ దానం చేయగా, నెఫ్రాలజిస్ట్ సురేష్ కుమార్‌రెడ్డి, యురాలజిస్ట్ సురేష్‌కుమార్‌రెడ్డి, మత్తు డాక్టర్ శేషయ్య, ఇంటెన్సివిస్ట్ జగదీష్, రేడియాలజిస్ట్ మదన్‌మోహన్‌రెడ్డి బృందం కలిసి రోగికి ఈ నెల 5న విజయవంతంగా మార్చారని వివరించారు. డాక్టర్లను ఆస్పత్రి ఈడీ గిరినాయుడు, హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ కుమార్, మెడికల్ కో ఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి అభినందించారు.

దుర్గా సప్తశతిపై ఉపన్యాసం

నెల్లూరు(బృందావనం): దేవీ పరాశక్తి, ఉపనిషత్తు, చండీ సప్తపది పారాయణంతో అజ్ఞానం, మూర్ఖత్వం పటాపంచలై జ్ఞానం, ప్రశాంత జీవనం కలుగుతుందని ఉపన్యాసకురాలు డాక్టర్ గిరిజా లక్ష్మి పేర్కొన్నారు. మూలాపేటలోని అన్నదేవుల గోవిందురెడ్డి సరస్వతీ సమాజంలో దుర్గా సప్తశతిపై శుక్రవారం ఆమె ఉపన్యసించారు. నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి, సమాజ అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య, సభ్యులు రమణయ్య, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి రెడ్డి, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జయహే.. మహిషాసురమర్దిని



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో..



మనుబోలు: మహిషాసురమర్దినిగా..



పొదలకూరు: మహిషాసురమర్దినిగా అమ్మవారు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని జగన్మాత మహిషసురమర్దినిగా శుక్రవారం దర్శనమిచ్చారు. ఆలయాలకు భక్తులు విశేషంగా హాజరై అమ్మణ్ణిని దర్శించుకున్నారు.

➡ మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. విశేష పూజలను వేదపండితులు నిర్వహించారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో లక్ష్మీదేవి విశేషాలంకారంలో దర్శనమిచ్చారు.

➡ ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా నరసాపురానికి చెందిన తాతా శ్రీనివాసులు, రాంబాబు, సురేంద్ర వ్యవహరించారు.

➡ పల్లిపాడులోని మీనాక్షి సమేత రామేశ్వర, వేణుగోపాలస్వామి ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు.

➡ మైపాడులోని శివాలయం, రాజరాజేశ్వరీదేవి ఆలయాల్లో విశేష పూజలను జరిపారు.

➡ పొదలకూరు: మండలంలోని బిరదవోలు పంచాయతీ బ్రాహ్మణపల్లి అంకమ్మతల్లి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తులకు మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్ – శ్రీదేవమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇంద్రసేన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

➡ మొగళ్లూరు భద్రకాళమ్మ దేవస్థానంలో అమ్మవారికి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవం నిర్వహించారు.

➡ పట్టణంలోని కన్యకాపరమేశ్వరీదేవి మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆలయ కోశాధికారి తన్నీరు వీరప్రకాశం, విజయకుమార్ వ్యవహరించారు.

➡ తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండలో ఉన్న జ్వాలాముఖి అమ్మవారి ఆలయం, నరుకూరులోని రాజరాజేశ్వరి ఆలయం, సౌత్‌ఆములూరులోని ఆములూరమ్మ ఆలయాల్లో మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అలాగే కోడూరులోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం పూజలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు మారం రెడ్డి బుజ్జిరెడ్డి – అపర్ణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పేదలకు అన్నదానం చేశారు.

➡ ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నం, బ్రహ్మదేవి, వల్లూరు, ఈపూరు, పిడతాపోలూరు, పైనాపురం, పోలంరాజుగుంట తదితర గ్రామాల్లోని ఆలయాల్లో పూజా కార్యక్రమాలు జరిగాయి.

➡ మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో అమ్మవారు శుక్రవారం మహిషాసురమర్దిని, దుర్గాదేవి, లలితాదేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంశర్మ, సాయికుమార్ శర్మ శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా బాగవతుల సురేష్, సుజాత, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, సుజాతమ్మ వ్యవహరించారు.

➡ యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము కొయ్యతో దుర్గాదేవి సూక్ష్మ రూపాన్ని తయారు చేశారు.



పొదలకూరు: బ్రాహ్మణపల్లిలో ప్రత్యేక పూజలు



టీపీగూడూరు: కోడూరులో పూజలు



బుచ్చిరెడ్డిపాళెం: కోదండరామస్వామి ఆలయంలో..



మనుబోలు: లలితాదేవి అలంకారంలో..